

జీ చెన్నారంలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**● జిల్లా రెడ్‌క్రాస్ యూత్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి**

నల్లగొండ రూరల్, డిసెంబర్ 9 : గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వృద్ధులు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెడ్‌క్రాస్ యూత్ కో ఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డిపార్ట్‌మెంట్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ డిజబిలిటీస్ సీనియర్ సిటిజన్స్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ, మొబైల్ మెడికేర్ యూనియన్ (ఎంఎంయూ) ప్రాజెక్ట్ సంయుక్తంగా నిర్వహించే గ్రామీణ వృద్ధుల హెల్త్ క్యాంప్‌ను మండలంలోని జీ చెన్నారంలో ప్రారంభించి మాట్లాడారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నల్లగొండ బ్రాంచ్ సహకారంతో రెండు నెలల నుంచి జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో వివిధ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఉన్న వృద్ధులకు ఇంటి వద్దే వైద్యం అందించాలనే మొబైల్ మెడికల్ కేర్ యూనిట్‌ని జిల్లాకు అందించినట్లు చెప్పారు. 55 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పునూతల వెంకన్న, ఉప సర్పంచ్ ప్రేమలత, మధుసూదన్‌రెడ్డి, సాయికుమార్, శ్రీకాంత్ హుస్సేన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పెన్షనర్స్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

## పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**● పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీశైలం**

రామగిరి, డిసెంబర్ 9 : పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్లా శ్రీశైలం అన్నారు. నల్లగొండలోని సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నల్లగొండ మండల యూనిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐక్యంగా ఉండి హక్కుల సాధనకై కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం పలువురి పెన్షనర్ల జన్మదినోత్సవం సందర్భంగా వారిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మండల యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాదవాసుదేవ్, ఆంజనేయులు, సుధాకర్, ఆజం అలీ పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ పోస్టర్ ఆవిష్కరణ

**● అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

నీలగిరి, డిసెంబర్ 9 : ఆరోగ్యశ్రీ పథకం నిరుపేదలకు వరం అని అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. శనివారం జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకం బీమా రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంపు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పేదల వైద్య చికిత్స కోసం ప్రభుత్వం గతంలో రూ.5 లక్షల వరకు ఖర్చు చేసేదని ఇప్పుడు దాన్ని రూ.10 లక్షల వరకు పెంచినట్లు



రాజీవ్ ఆరోగ్యశ్రీ నగదు పెంపు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లచ్చు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డీఆర్‌డీఓ కాళిందిని, డీసీహెచ్‌ఎస్. డాక్టర్ మాతృ, మెప్మా పీడీ కరుణాకర్, డీపీఆర్‌ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులు

## రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

ఆలేరు రూరల్, డిసెంబర్ 9 : మండలంలోని కొలనుపాక జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు బి.శ్రవణ్‌కుమార్, కె.రాంచరణ్ భువనగిరిలో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.రాంచంద్రయ్య తెలిపారు. శనివారం విద్యార్థులను ఎస్ఎంసీ చైర్మన్ కొండల్, పీడీ లింగయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 9 : మండలంలోని కొరటికల్ పంచాయతీ కార్యాలయ ఉద్యోగి పెండెం సత్యపాల్ ఇటీవల మృతి చెందగా.. గ్రామ పంచాయతీ వర్కర్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం 5వేల ఆర్థికసాయం ఆయన కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో స్వామి, కిష్టయ్య, శ్రీనివాస్, యాదయ్య పాల్గొన్నారు.



కేవైసీ అప్‌గ్రేడ్‌కు బారులు తీరిన జనం

## గ్యాస్ ఏజెన్సీల వద్ద జనం బారులు

నల్లగొండ రూరల్, డిసెంబర్ 9 : ఆయిల్ కంపెనీల ఆదేశాల మేరకు గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల కేవైసీని అప్‌గ్రేడ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో భాగంగానే నల్లగొండలోని అన్ని గ్యాస్ ఏజెన్సీలు కేవైసీ అప్‌గ్రేడ్‌కు ఉపక్రమించాయి. దాంతో ఆయా కంపెనీల వినియోగదారులు ఫోన్ నంబర్, ఆధార్ కార్డు, గ్యాస్ బుక్‌తో తమ వివరాలను అప్‌డేట్ చేయించుకుంటున్నారు. అయితే వారిని చూసిన ఇతర వినియోగదారులు కాంగ్రెస్ ఇటీవల ప్రకటించిన రూ.500కే గ్యాస్ అందజేత కోసమని భావించి శనివారం పెద్ద ఎత్తున జిల్లా కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరారు.



భూదాన్‌పోచంపల్లిలో వేదిరె రామచంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

## రామచంద్రారెడ్డికి నివాళి

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 9 : భూదాన్‌పోచంపల్లిలో శనివారం వినోబా సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రథమ భూదాత వేదిరె రామచంద్రారెడ్డి 36వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొయ్యడ నరసింహాగౌడ్, ప్రధాన కార్యదర్శి వేశాల మురళి, ప్రతినిధులు చిట్టిమల్ల బసవలింగం, చింతకింది యాదగిరి, బల్ల దర్శన్, పెండెం కృష్ణ, సీత వెంకులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

**● సబ్‌స్టేషన్ ఎదుట బాధిత కుటుంబం ఆందోళన**



నరేశ్ (ఫైల్)

తుర్కపల్లి, డిసెంబర్ 9 : మండలంలోని ముల్కలపల్లి గ్రామ పంచాయతీ పరిధి కిమ్యాతండాలో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బంధువులు శనివారం తుర్కపల్లి సబ్‌స్టేషన్ ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిమ్యాతండాలో ట్రాన్స్‌ఫార్మర్ లోపంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. తండావాసులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించినా స్పందించకపోవడంతో తండాకు చెందిన రమావత్ నరేందర్(23) ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో ఎర్త్ వైర్ తగిలి విద్యుత్ ఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే నరేశ్ మృతి చెందాడని ఆరోపిస్తూ శనివారం తుర్కపల్లిలోని సబ్‌స్టేషన్ వద్ద భువనగిరి– గజ్వేల్ రహదారిపై నరేందర్ బంధువులు, తండావాసులు మృతదేహంతో ధర్నా నిర్వహించారు. వాహనాలు భారీగా నిలిచిపోవడంతో యాదగిరిగుట్ట సీఐ సురేందర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. విద్యుత్‌శాఖ అధికారులను సంప్రదించి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. బాధిత కుటుంబ సభ్యులు విద్యుత్ సిబ్బందిపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం మృతదేహాన్ని భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు.

## ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

భువనగిరి అర్బన్, డిసెంబర్ 9 : పట్టణంలోని పచ్చలకట్ట సోమేశ్వర ఆలయంలో శనివారం అయ్యప్ప మహా పడిపూజను నిర్వహించారు. గణపతి హోమంతో పాటు అయ్యప్ప స్వామికి నవాభిషేకాలు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కాలేరు లక్ష్మణరావు, ఆలయ ప్రధాన పూజారి కప్పగంతుల నాగరాజశర్మ, గురుస్వామి సాధు ఉపేందర్, శ్రీనివాస్‌గుప్తా, నరసింహాచారి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో శనివారం గురుస్వామి దాచ రమేశ్‌గుప్తా ఆధ్వర్యంలో 18వ అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన గురుస్వామి మహేశ్ అయ్యప్ప పాటలతో ప్రత్యేక పూజలు జరిపారు.

## బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల ఆందోళన

యాదగిరిగుట్ట, డిసెంబర్ 9 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని విద్యార్థులు శనివారం కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ఆర్టీసీ అధికారులకు విన్నవించారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**● కలెక్టర్ హనుమంతు కె జెండగే**

భువనగిరి అర్బన్, డిసెంబర్ 9 : ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హనుమంతు కె జెండగే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.10లక్షలకు పెంచిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం వాల్‌పోస్టర్‌ను శనివారం ప్రభుత్వ ఏరియా దవాఖానలో ఆవరణలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మహిళలకు ఉచిత బస్సు సర్వీస్ కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని భువనగిరి బస్టాండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం



మహిళలకు ఉచిత బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ హనుమంతు కె జెండగే

కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహిళలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి సురేందర్‌రెడ్డి, కూర వెంకటేశ్, తంగళ్లపల్లి రవికుమార్, వెంకటేశ్వర్లు, జహంగీర్, మైనార్టీ నాయకులు ఎండీ తహర్ పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఏసీపీ శివరామ్‌రెడ్డి

## వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

**● ఏసీపీ శివరామ్‌రెడ్డి**

మోటకొండూర్, డిసెంబర్ 9 : గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని ఏసీపీ శివరామ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మాటూరులో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తుమ్మల కీర్తివర్ధన్‌తేజస్విరెడ్డి, సర్పంచ్ పోతిరెడ్డి స్వప్నామైపాల్‌రెడ్డి, ఎస్ఐ తేజంరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.


**ప్రకటన**

నా క్లయింట్ అయిన కర్నాటి మౌనిక భర్త చిలువేరు దుర్గాప్రసాద్, వయస్సు:29 సంవత్సరములు, వృత్తి, గృహిణి, నివాసం ఇ.నెం.6-2-1333/1, నేతాజీ కాలనీ, హైదరాబాద్ రోడ్, నల్లగొండ మండలం & జిల్లా గారు ఇచ్చు ప్రకటన ఏమనగా, విక్రయ దస్తావేజు నెం.2185/2022, తేది:25-02-2022 ద్వారా సంక్రమించినటువంటి ఇల్లు యొక్క ఒరిజినల్ లింక్ విక్రయ దస్తావేజులు నెం.3110/2021, Dated: 18-02-2021, SRO-Devarakonda గలది బస్సులో దేవరకొండ నుండి హైదరాబాద్‌కు వెల్లుచున్న సమయములో పోయినది. ఇట్టి విషయంపై దేవరకొండ పోలీస్ స్టేషన్ నందు కంప్లయింట్ చేసినారు. ఇట్టి ఇంటి యొక్క వివరములు. గ్రామ కంఠంలో గల ఇంటి నెం.9-129, విస్తీర్ణం 56.22 చదరపు గజములు=47.09 చదరపు మీటర్లు, బ్లాక్ నెం.9, దేవరకొండ పట్టణం మరియు మండలము, నల్లగొండ జిల్లా. సదరు ఆస్థి యొక్క హద్దులు ఉత్తరం:8.00 ఫీట్ల శేరి నందు మరియు నల్లగిన్నెల వీరబ్రహ్మం గారి ఇల్లు, దక్షిణం:మహమ్మద్ ఖలీల్ గారి ఇల్లు, తూర్పు: సముద్రాల కృష్ణమ్మ భర్త వెంకట్నారాయణ గారి ఇల్లు, పడమర:14.00 ఫీట్ల వెడల్పు గల ఇంటర్నల్ రోడ్, ఎవ్వరికైనను పై దస్తావేజు దొరికినచో నా క్లైంటుకు తిరిగి ఇవ్వగలరు. ఇట్టి విషయంపై ఎవ్వరికైనను ఎటువంటి అభ్యంత్రములున్నచో తగిన ఆధారములతో (5) ఐదు రోజులలో ఈ క్రింది తెలిపిన చిరునామాలో సంప్రదించగలరు.

సం/- **నాంపల్లి చంద్రశేఖర్**
న్యాయవాది & నోటరీ
ఇంటి నం.6-2-439/1, శ్రీనగర్ కాలనీ,
నల్లగొండ-508001, తెలంగాణ,
సెల్: 9440422393

నల్లగొండ
తేది:09-12-2023